# మహా ఉత్తర లేఖలు

## 1

ప్రియమైన పరిమిత సంతానరావుగారికి,

నమస్సులు. ఇటీవల చాలాకాలం నుండి మీరు ఉత్తరాలు రాయటంలేదు. కారణం తెలియదు. ఈ శిష్య పిపీలిక మీద మీకు ఆగ్రహం కలిగిందా? మీ దగ్గరనుండి లేఖ రాకపోతే నాకు తెలుగు సినిమా కథానాయికలాగ "అదోలా" వుంటుంది. వెంటనే మీ క్షేమసమాచారం తిరుగుటపాలో తెలియచేయండి. మీ బరువూ మీ శ్రీమతి బరువూ దినదిన గంటగంట ప్రవర్ధమానం అవాలని భగవంతుణ్ణి సదా ప్రార్థిస్తున్నాను. మీ ఇద్దరు పిల్లలూ కులాసా అని తలుస్తాను.

మీ

సదానందం సంజీవరావు.

## 2

డియర్ రావుజీ,

నమస్సులు. మీరు తేనెపూసి రాసిన ఉత్తరం అందింది. నా మీద మీ అపార వాత్సల్యానికి నేను ఎప్పుడూ కృతజ్ఞుణ్ణే. నా గదిలో మీ ఫొటో పెట్టుకుని ఖాదీ మాల వేసాను. (ఇది గాంధీ శతజయంతి సంవత్సరం కదా)

ఇవాళ పొద్దున్న మీ పేర ఒక రైల్వే పార్సిల్ పంపించాను. అది దయతో స్వీకరించండి. "నో" అంటే నేను ఇక్కడ మూర్ఛపడిపోతాను. అందులో సీతాఫలాలూ సపోటాలూ వున్నాయి. వెంటనే ఉత్తరం రాయండి.

మీ

శిష్యపరమాణువు

స. సం

## 3

గురురూజీ,

మీరు ప్రేమ చిప్పిలుతూ రాసిన ఉత్తరం అందింది. దానికి ఫ్రేముకట్టించి గోడకు కొట్టాను. వందలాదిజనం క్యూలో నిలబడి ఆ లేఖ చదివి అమందానంద కందళిత హృదయారవిందు లవుతున్నారు. ఏమి శైలి మీది! చాకులా బాకులా ఉంటాయి మీ భావాలు.

మీరు అన్యధా భావించకపోతే ఒక చిన్న రిక్వెస్టు. నా పుస్తకం ఫలానా పరిషత్తువారు మీకు బహుమతి నిర్ణయానికి పంపారని తెలిసింది. నన్ను డిసపాయింటు చేయకండి. నాకు బహుమతి రాకపోతే నా కంటె నా మిత్రులు ఎక్కువ బాధపడిపోతారు.

మీరూ మీ శ్రీమతీ హారిజాంటల్‌గా పెరగాలనికోరుతున్నాను. మీ పిల్లలు వర్టికల్‌గా పెంపొందాలని ప్రార్థిస్తున్నాను.

భవత్ విధేయుడు

సాహిత్య పిపీలిక బిరుదాంకిత

సః సం॥.

గోపాలచక్రవర్తి